కసాయివాడి కన్నీరు

"సన్నమ్మా! ఓ సన్నీ! బయటకు రాయే!" అంటూ బిగ్గరగా కేక పెట్టాడు కొండయ్య.

"ఏటా యిసురుబాటు! కూసింత ఆగనేవేటి? కోక సుట్టుకుంతున్నా" అంది గుడిసెలోంచి బయటకు వస్తూ.

"సేసుకున్న సెకు సాల్లే! నీ బొట్టేడు సేస్తన్న పాటుకు పోయి సూసేడానికి పిలకట్టు, సీరా యేసుకుపో పని లేదే! గోసీ ఏసుకుని ఎల్లొచ్చు!" అన్నాడు వెటకారంగా.

"ఏనాడూ నేంది యీ పొద్దు యిట్టా వోల్లావన సేస్తన్నావు ఏటి అయింది నీకు?" అంది.

"ఇంకా ఏటవ్వాలే! మన సూరయ్యగోడు మోసం సేసినాడే! ఆడు ఏదో గొప్ప సదువులుసదివి పెద్ద వుజ్జోగాలు ఎలగబెడతన్నాడని కలగన్నవు! కడుపులు మాడ్చుకుని పైసా పైసా పోగెట్టి ఆడికి అంపించినావు. ఆడిని పూరాగా సెడగొట్టినావు. ఆడేటి సేస్తనానడో నీకల్లత నువ్వు సూస్తవుగాని బయలెల్లు" అంటూ భార్య రెక్క పట్టుకొని నాలుగు అడుగులు వేశాడు కొండయ్య.

సన్నమ్మకేమీ అర్థం కాలేదు. భర్తచేతిని విడిపించుకొని అతని వెంట బయల్దేరింది.

ఆమెకు కొడుకు సూరయ్యమీద ఎనలేని నమ్మకం ఉంది. వాడు ఎంతో చురుకైనవాడు తెలివైనవాడు. ఎరిగి మరిచి వాడు తప్పుపని చేయడు.

"మనం ఎర్రిబాగులోల్లం! మతిలేని వోల్లవని గెహించే రావయ్యమేట్టరు మన్ని గుమ్మీల దిగేసీసినాడు!"

"నీకు అనుబవం నేదే! కూలోడి కొడుకు కూలిపని సేసి ఆడూ కూలోడే అవ్వాల! రిచ్చావోడి కొడుకు రిచ్చాలాగాల! సెప్పుకుట్టేవోడి కొడుకు సెప్పులే కుట్టాల! అదీ సబవు! ఆల్లు కలెట్టర్లూ, ఇంజినీల్లు డాట్టర్లూ అవుతారని బెమపడకు ఎఱ్ఱిమొకమా"

"రావయ్యా మేట్టరుగోరు సెవతన్నారని ఆడేదో పెద్దసదువులు ఎలగ బెడతన్నాడని మునగసెట్టెక్కి కూకున్నావు. పదేళ్ళు ఎదురు సూసినావు. ఏడాదికో సట్టు కలబడి ఆడు సెప్పే కతలు నిజివే అనుకుని మురిసిపోనావు. ఈ పొద్దు సూడవే ఆడేటో ఆడియాసవేటో, రంగేటో అంతా బయటడిపోనాది" కొండయ్య దారి పొడుగునా కొడుకుని నిందిస్తున్నాడు.

ఎంత ఆలోచిస్తున్నా సన్నమ్మకు కొడుకు చేసిన తప్పేడు పనేమిటో అర్థం కాలేదు. దానికంటే భర్తకు అంత కోపం రావడం ఆమె ఎన్నడూ చూడలేదు. కొండయ్య స్వతహాగా ఎంతో నెమ్మదస్తుడు. అతడు నోరి విప్పి మాట్లాడడం అరుదు.

సూరయ్య చదువు పూర్తైన వెంటనే అతనికి హైదరాబాదులో పెద్ద ఉద్యోగం వచ్చింది. వెళ్ళి జాబ్‌లో చేరేడు. తల్లినీ తండ్రినీ హైదరాబాదు తీసుకొని వెళ్ళడానికి అతను బయలుదేరి వస్తున్నాడు. అతను వస్తున్న విషయం తెలుసుకొని పట్నంలో లయన్సుక్లబ్‌వారు అతనికి పౌరసన్మానం ఏర్పాటు చేసేరు. సన్మానానికి తన తల్లిదండ్రులను తీసుకొని రమ్మనమని రామయ్య మేష్టారుకి కబురు పంపేడు. తల్లిదండ్రులకు , మేష్టారుకి ఖరీదైన బట్టలు పంపించేడు. ఈలోగా ఈ గొడవొచ్చింది. భర్త వెంట నడుస్తున్న సన్నమ్మకు పాత విషయాలు గుర్తుకొచ్చేయి...

"సిత్తం బాబయ్యా! తవలాటి పెద్దోరి దరిసెనం సేసుకునేటయాంల ఉత్త సేతల రానేం గదయ్యా! పండూ కాయా మాలాటి వోరి సేతల తవలాటోరు దీసుగుంటారో నేదో బయం! ఇది మా సేతిల పని. తవరి పాదాలకి సెప్పులు గుట్టి దెచ్చినావండి!" అన్నాడు కొండయ్య చేతిలో కొత్త చెప్పులను తలగుడ్డ తీసి మరొకమారు తుడిచి మేష్టారి పాదాల దగ్గరుంచేడు.

మూడు నెలలనుండి కొత్త చెప్పులు కొనుక్కోవాలనుకుంటూ ఆర్థిక ఇబ్బందుల వల్ల వాయిదా వేస్తున్నారాయన. పాత చెప్పులకే పలుమార్లు కొండయ్య చేత మాసికలు వేయించి నెట్టుకొస్తున్నారు.

రామయ్య మేష్టారు వాటిని తీసుకోవడానికి తటపటాయించారు. నెలాఖరు రోజులు. వాటి ఖరీదు చెల్లించటానికి ఆయన వద్ద ప్రస్తుతం డబ్బులేదు. జీతాలు వచ్చేక చెల్లిద్దామనుకొని. "వీటి ధర ఎంతో చెప్పవోయ్!" అన్నారు. చెప్పులు కాళ్లకు వేసుకొని చూసుకున్నారు. చక్కగా సరిపోయాయి.

"ఎంత మాటనీసినారు బాబయ్యా! సదువులు సెప్పే మేట్టరిగోరికాడ మావు పొమ్ముచ్చుగుంటావా!" అంది కొండయ్య భార్య సన్నమ్మ నొచ్చుకుంటూ.

"బావూ ఈడు మా ఒక్కగానొక్క బొట్టెడు సూరయ్య. ఈడు సదువుకుంతానని ఇంటికాడ ఒటే నస యెడతన్నాడు. ఈడయ్య యీడిని పని నేరుసుకోమని బోద సెస్తన్నాడు. నాలుగేల్ల గుంటడు. ఈడికి పనికి తొందరేటి? నాలుగచ్చరం ముక్కలు నురుసుకోనీ. అయినాక సేతిల ఇద్దె నేరుసుగోవొచ్చు ఏడబోతాదని నాను తగవులాడతన్నాను. తవరు యీడికి నాలుగచ్చరాలు నేర్వండి బాబయ్యా. తవరి మేలు మరుపం!" అంది సన్నమ్మ చేతులు జోడించి.

"ఏం సూరయ్యా! నువ్వు చదువుకుంటావా?" అన్నారు రామయ్య మేష్టారు చిరునవ్వుతో.

"అవునండయ్యా!" అన్నాడు సూరయ్య సంతోషంతో చేతులు జోడించి.

"ఈ రెండు నెలలూ సెలవులు. స్కూలు లేదు. నేను ఇంటివద్దే ఉంటాను. నువ్వు రోజూ ఉదయాన్నే మా ఇంటికి రా! నీకు అక్షరాలు అవి రాయడం చదవడం నేర్పుతాను. స్కూలు తెరిచిన తరువాత నిన్ను అందులో చేర్పిస్తాను" అన్నారు.

ఆయన మాటలకు సూరయ్య, వాడి తల్లిదండ్రులు సంతోషించేరు.

"బాబూ అడి సదువుకు పలకా..."

"నా దగ్గరున్నాయి, నేనిస్తాను" అన్నారు.

రామయ్యమేష్టారి భార్య జానకమ్మ తన పిల్లలకు కురచైన రెండు నిక్కర్లు, చొక్కాలు తెచ్చి సూరయ్యకిచ్చింది. వాడు వాటిని తీసుకుని ఆనందించేడు. మర్నాడుదయం సన్నమ్మ కొడుకుని తీసుకొని వచ్చి మేష్టారికి వప్పగించి వెళ్లింది. రామయ్యగారు కొత్తపలక తెచ్చి దానిమీద అఆఇఈ అని నాలుగు అక్షరాలు రాసి వాడిచేత చెప్పించి దిద్దమన్నారు.

వాడు వాటిని పదినిమిషాలు చదువుతూ దిద్ది చూడకుండా రాసి మేష్టారికి చెప్పేడు. వాడు చురుకుతనానికి ఆయన అబ్బురపడి మరో నాలుగు అక్షరాలు రాసిచ్చేరు. వాటిని కూడా వాడు త్వరగా నేర్చుకున్నాడు. నాలుగురోజుల్లో వాడు అక్షరాలు, గుణింతాలు, అంకెలు నేర్చుకొని ఒకటవ తరగతి పుస్తకంలో పేర్లు, వాక్యాలు చదవసాగాడు.

స్కూలు తెరిచిన తరువాత వాడిని స్కూల్లో జాయిన్ చేసేరు. చదువులో క్లాసు ఫస్టు. మూడేళ్ళ తరువాత వాడిని పట్నంలో సంక్షేమ హాస్టల్లో చేర్పించి చదివించేరు. వాడికి స్కాలర్‌షిప్ వచ్చింది. టెన్త్ స్టేట్‌ఫస్ట్ వచ్చేడు. వాడి అభీష్టం మేరకు వాడు కోరిన కోర్సులో చేర్పించి చదివించేరు ఆయన.

కొడుకు అవసరాలకు తల్లీతండ్రీ పైసాపైసా కష్టపడి సంపాదించి వాడికి అడపాదడపా మేష్టారి ద్వారా పంపేవారు.

"రావయ్య మేట్టరుగోరు ఈ పొద్దు పెందిల కబురెట్టి సూరయ్య యీ దినం

వస్తున్నాడు. మీకు బట్టలు పంపేడు. ఆడికి పట్టనంల యీయేల సన్మానం. మిమ్మల్ని దీసుకురమ్మన్నాడు" అని సెప్పేరు.

"మద్దిన మరి యీ అవాంతరవేటి?" అని ఆలోచనలతో పరాకుగా అడుగులు వేస్తున్న భార్యను..."సూడవే సూడు! ఆడ నీ కొడుకేటి సేస్తన్నాడో బాగా సూసుకో!" అని ముందుకు నెట్టేడు.

సన్నమ్మ తృళ్లిపడి ఆలోచనల లోంచి తేరుకుంది. కొడుకు చేస్తున్న పని చూసి ఉగ్రరూపిణియై ముందుకురికింది. కొడుకు ఫిల్ట్‌పట్టుకొని పైకి లేవనెత్తింది.

"నువు సదివిన సదువు సేస్తన్న వుజ్జోగం ఇదట్రా భాడకా!" అని ఈ చెంపా ఆ చెంపా ముమ్మారు వాయించింది. అదే వూపున వెళ్లి భర్త చేయి పట్టుకొని..." ఆడు నాకు పుట్టనేదనుకుంతాను పద" అంది ఆవేశంతో.

ఈ సంఘటనకు అక్కడున్న వారంతా నివ్వెరపోయేరు.

'సూరయ్య వెంటనే తేరుకుని "అమ్మా!...." అని ఏమో చెప్పబోయాడు బొంగురుపోయిన గొంతుకతో.

"సీ నువు అట్టా పిలవక..."

"ఆగు సన్నమ్మా! ఎంత పని చేశావు. ప్రయోజకుడైన చెట్టంత కొడుకుని నలుగురి ముందూ కొట్టడానికి చేతులెల్లా వచ్చేయి! నీ మనసెలా ఒప్పింది? వాడు చేసిన నేరం ఏమిటమ్మా!" అన్నారు రామయ్యగారు తొందరగా అడుగులు వేస్తూ వారి వద్దకు వచ్చి.

"ఆడు సేస్తన్న పనేటో తవకింకా అవుపడతనేదేటండీ! ఆడిని అన్ని ఇదాల సెడగొట్టింది నువుగాదేటి?" అంది రోషంగా.

"అవును సన్నమ్మా! మీ వాడిని చెడగొట్టింది నేనే! సూరయ్య ఎంతో తెలివైనవాడు, చురుకైనవాడు అని గ్రహించి వాడికి నాలుగు అక్షరాలు నేర్పించడం నే చేసిన పెద్ద నేరం! వాడు చదువుకు పట్నంలో నలుగురినీ ప్రాధేయపడి వసతులు వనరులు సమకూర్చి వాడు కోరిన విధంగా చదివించి వాడిని గొప్ప డాక్టరుగా చేయడం నేను చేసిన మరొక నేరం!"

"మాష్టారూ! మనుషులకు రోగాలు వస్తే వారు తమ బాధలను డాక్టర్లకు

చెప్పుకుని వైద్య సహాయం పొందుతారు. మందులు వాడి రోగాలు నయం చేసుకొంటారు. కాని జంతువులకు రోగాలు వస్తే అవి నోరు విప్పి వాటి బాధలు చెప్పలేవు. వాటి ప్రవర్తనను బట్టి వాటి జబ్బులను తెలుసుకొని చికిత్స చేయడమే గొప్పపని. అందుచేతనే నేను పశువుల డాక్టర్ని అవుతానని నీ కొడుకు సూరయ్య అది సాధించేడు. ఈ రోజు అతను దేశంలో గొప్ప పశువుల డాక్టరు. చదువు పూర్తయిన వెంటనే వాడికి హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. వాడు మిమ్మల్ని హైదరాబాదు తీసుకుపోదామని వచ్చేడు. అతను వస్తున్న విషయం తెలుసుకొని లయన్స్ క్లబ్‌వారు ఈ రోజు సాయంత్రం అతనికి పౌరసన్మానం ఏర్పాటు చేశారు"

అయితే అతను ఉదయం పట్నం రాగానే ఈ చుట్టుప్రక్కల గ్రామాల్లో పశువులు వింతరోగంతో చనిపోతున్నాయన్న సంగతి ఇక్కడ డాక్టర్ల ద్వారా తెలుసుకున్నాడు. వారి కోరిక మేరకు వారికి పశువులకొచ్చిన వింతరోగం గురించి వివరిస్తున్నాడు. జబ్బు వచ్చి చనిపోయిన పశువును కోసి జబ్బు వివరాలు అందరికీ బోధపరుస్తున్నాడు. అక్కడ నీ కొడుకు చుట్టూ ఉన్న వారంతా డాక్టర్లే!" అన్నారు రామయ్య మేష్టారు.

"బుద్ధిగేనంలేని మూర్కుడిని! కన్నతల్లిని కొడుకుమీదకు ఉసిగొలిపిన కసాయివోడిని! ఎర్రి బాగుల్ది దానికేటీ తెల్దు! దాని దోసవేటీనేదు సెమించండి బాబయ్యా!" అని కంటనీరు పెట్టుకొని రామయ్య మేష్టారి కాళ్లమీద పడ్డాడు కొండయ్య.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 8 డిసెంబరు 2001) ✪